ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

బుధవారం 10 ఏప్రిల్ 2024





రంజాన్ వేళలు

ఇఫ్తార్

బుధవారం

సాయంత్రం - 6:36

ఉగాది వేడుకలు

- ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణాలు
- షడ్రుచుల మేళవింపు.. ఉగాది పచ్చడి ఆరగింపు



కీసరగుట్టపై రామలింగేశ్వరుడి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కీసర/వికారాబాద్ ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీ క్రోధి నామ తెలుగు కొత్త సంవత్సర ఉగాది పండుగను మంగళవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల ప్రజల జీవితాల్లో సరికొత్త ఉషస్సులు నింపింది. తెలుగు లోగిళ్లకు ఉగాది ప్రత్యేక శోభను తీసుకువచ్చింది. మంగళవారం ప్రతీ ఇల్లు పచ్చని తోరణాలతో కళకళలాడింది. కొత్త ఆశలతో ఆనందోత్సాహాల మధ్య తెలుగు నూతన సంవత్సరాది ఉగాదికి స్వాగతం పలికారు. ఇంటిని మామిడి తోరణాలతో, గుమ్మాలను పసుపుతో అలంకరించారు. పిండివంటలు, ప్రత్యేకంగా తయారు చేసిన భక్షాలను ఇష్టదైవాలకు నైవేద్యంగా సమర్పించి మహాప్రసాదంగా ఆరగించారు. షడ్రుచుల మేళవింపుతో ఉగాది పచ్చడిని తయారుచేసి తాగారు. అనంతరం ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. కాగా ఉగాదిసందర్భంగాకీసరగుట్టలో రామలింగేశ్వరుడి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పరిగి హనుమాన్ ఆలయంలో పంచాంగం వింటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



దహన సంస్కారాలకు నిర్మించిన దిమ్మె పక్కన తవ్వకాలు

శ్మశానవాటికనూ తవ్వేస్తున్నారు

- మొరం కోసం తవ్వకాలు
- కూలిపోయే దశలో శ్మశానవాటిక పిల్లర్లు



రుక్మాపూర్‌లో అసంపూర్తిగా స్మశానవాటిక

పెద్దేముల్, ఏప్రిల్ 8: కాదేది తవ్వకాలకు అనర్హం అన్నట్లుగా మారి అక్రమార్కుల తీరు. ఇప్పటి వరకు ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపిన వారు ఇప్పుడు ఏకంగా శ్మశానవాటికలపై కన్నేశారు. మొరం కోసం శ్మశానవాటిల్లో తవ్వకాలు జరుపుతుండటంతో దహన సంస్కారాలకు నిర్మించిన శ్మశానవాటిక పిల్లర్లు ప్రమాద అంచునకు చేరుకున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడటంలేదు. దీంతో తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లు వ్యాపారులు మొరం తవ్వుకుని వెళ్తున్నారు. పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామంలో శ్మశానవాటిక నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధుల నుంచి రూ.12.60లక్షలు కేటాయించింది. అయితే రుక్మాపూర్ శివారులో శ్మశాన వాటిక నిర్మాణానికి స్థలం లేకపోవడంతో అధికారులు రుక్మాపూర్ శివారును ఆనుకుని ఉన్న రేగొండి గ్రామ శివారులో 5గుంటలు భూమిని కేటాయించారు. దీంతో అక్కడ శ్మశాన వాటిక నిర్మాణం చేశారు. ప్రస్తుతం అది అసంపూర్తిగా ఉంది. కొంతమంది అక్రమార్కులు ఇదే అదునుగా భావించి శ్మశాన వాటికలో మొరం తవ్వకాలు చేపట్టారు. యంత్రాల ద్వారా మొరం తవ్వుకుని వెళ్తున్నారు. దహన సంస్కారాలు చేయడానికి ఏర్పాటు చేసిన దిమ్మె పక్క నుంచి పెద్ద గోతులు తీయడంతో అది ప్రస్తుతం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. వర్షాకాలం జోరుగా వర్షాలు కురిస్తే దిమ్మె పక్కన మొరం మొత్తం కొట్టుకుపోయి అది కూలిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం కేటాయించిన రూ.12.60 లక్షలకు గాను అక్కడ సుమారు 8లక్షల వరకు పనులు జరిగినట్లు తెలుస్తోంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు సుమారు రూ.7లక్షల దాకా చెల్లింపులు జరిగాయి. పనులు పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో అటువైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. అక్రమార్కులు ఇదే అదునుగా భావించి శ్మశాన వాటికను తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా అక్కడ తవ్వకాలు జరగకుండా అడ్డుకుని స్మశానవాటికలోని నిర్మాణాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారుతుందని పలువురు అంటున్నారు.

మండుతున్న ఎండలు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 8గంటల నుంచి ఎండ తీవ్రత పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మధ్యాహ్నం ఎండ పరిస్థితి భయంకరంగా ఉంటోంది. జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్దలో 39.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 39.6డిగ్రీలు, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని ఆదర్శ్‌నగర్‌లో 38.2డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కాంగ్రెస్ దూకుడు

స్పీడ్ పెంచిన సీఎం రేవంత్

- చేవెళ్ల, మల్కాజ్‌గిరిలపై ఫోకస్
- సీఎంకు సవాల్‌గా మారిన రెండు ఎంపీ స్థానాలు
- తుక్కుగూడ 'జనజాతర'తో కేడర్‌లో జోష్





లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థి పార్టీలకు అవకాశం ఇవ్వకూడదన్న ఉద్దేశ్యంతో దూకుడు పెంచింది. ఈ నెల 6న మహేశ్వరం మండలం తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభ సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపి ఎన్నికల కదనరంగంలో దూసుకుపోవాలనే సందేశాన్నిచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభా స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఇతర పార్టీల్లోని బలమైన నేతలను హస్తం పార్టీలో చేర్చుకుంటున్నారు. ఎన్నికల నాటికి పార్టీని మరింత పటిష్టం చేసి అభ్యర్థులను గెలిపించాలనే కృతనిశ్చయంతో సీఎం రేవంత్ పావులు కదుపుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో అధికార కాంగ్రెస్ ప్రచారంలో దూకుడు పెంచింది. తుక్కుగూడలో ఇటీవల నిర్వహించిన 'జనజాతర' సభ విజయవంతంతో కాంగ్రెస్ కేడర్‌లో జోష్ మరింత పెరిగింది. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం ప్రస్తుత సానుకూల పరిస్థితులను అవకాశంగా మలుచుకొని ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించే దిశగా పని చేస్తోంది. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలు రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన నియోజకవర్గాలనే విషయం అందరికీ తెలిసిందే. ఇందులో చేవెళ్ల పార్లమెంట్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. అలాగే మల్కాజిగిరి స్థానం సైతం నిన్నమొన్నటి వరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఎంపీ స్థానం అన్న విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు స్థానాల్లో పార్టీని గెలుపు తీరాలకు చేర్చడం సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో తుక్కుగూడలో గత శనివారం నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభ విజయవంతమైంది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, జాతీయ, రాష్ట్ర నేతలు పాల్గొన్న ఈ సభకు లక్షలాదిగా జనం తరలివచ్చారు. సభకు ఉమ్మడి జిల్లాలోని ఈ రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు అంతర్భాగంగా ఉన్న భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి సైతం జనం భారీగా తరలివచ్చారు. ఈ సభ విజయవంతం కావడంతో పార్టీ కేడర్‌లో మరింత జోష్ పెరిగింది. నూతనోత్సాహంతో ఉన్న కేడర్‌ను మరింత కార్యోన్ముఖులను చేసి ఎన్నికల వరకు ఇదే జోష్‌ను కొనసాగించేందుకు పార్టీ నాయకత్వం తగిన వ్యూహరచనలు చేస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు, ఇతర ముఖ్యనేతలు, డీసీసీ అధ్యక్షులు స్థానిక నాయకులు, కార్యకర్తలతో రోజువారీ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ త్రిముఖ పోటీ నెలకొనడంతో కాంగ్రెస్ పైచేయి సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రోజు రోజుకూ బలహీనపడుతుండడంతో కాంగ్రెస్‌కు బీజేపీతోనే గట్టిపోటీ నెలకొనే పరిస్థితులు కన్పిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలనంతరం ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ క్రమంగా పట్టును కోల్పోతోంది. ముఖ్యనేతలంతా అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ వైపు చూస్తున్నారు. కీలక నేతల్లో ఎక్కువ మంది ఇప్పటికే పాలక కాంగ్రెస్‌లో చేరారు. త్వరలో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారమూ సాగుతోంది. దీంతో 'గులాబీ' పార్టీలో గుబులు రేగుతోంది. ఎన్నికల అంచున ఇప్పటికిప్పుడు ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని తయారు చేసుకోలేక పార్టీ బలహీనపడుతోంది. ఎన్నికలు మరో నెలరోజులకుపైగా ఉన్న నేపథ్యంలో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉంటుందనే ప్రచారం సాగుతోంది.



రెండు స్థానాలపై సీఎం ఫోకస్

ఇదిలా ఉంటే నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్‌లో అధికారం చెలాయించిన నేతలు ఇపుడు కాంగ్రెస్‌లో చేరి ఇక్కడా పెత్తనం చేస్తుండడంపై క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చేరికల సమయంలో కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వకుండా కొత్తగా పార్టీలో చేరిన వారితోనే వ్యవహారాలన్నీ నడుపుతున్నారని సీనియర్లు గుర్రుగా ఉన్నారు. కాంగ్రెస్‌లో చాపకింద నీరులా ఉన్న అసమ్మతి చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమావేశంలో ఇటీవల బట్టబయలైంది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి నేరుగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. పార్టీ అధినాయకత్వం అందరికీ డోర్లు తెరుస్తామంటూ పదే పదే ప్రకటిస్తోందని, కాంగ్రెస్‌ను మోసం చేసిన వారిని, దొంగలను లోపలికి తీసుకువస్తే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు స్పీకర్ ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. ఆ సమయంలో కేఎల్లార్ చేసిన వ్యాఖ్యలు కలకలాన్ని రేకెత్తించాయి. మరో వైపు చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులిద్దరూ బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారే కావడం కొందరు స్థానిక నేతలకు రుచించడం లేదు. దీంతో అసంతృప్త నేతలు ఇప్పటికీ ఎన్నికల ప్రచారాల్లో అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ పరిస్థితులను అధిగమించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా రంగంలో దిగారు. ఆరు నూరైనా ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిందే అనే సందేశాన్ని కేడర్‌కు ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా రోజూ ఏదో ఒక ఎదుటి పార్టీల నేతలు, నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకునే పనిని ముమ్మరం చేశారు. పార్టీలోకి ఎవరొచ్చినా ఎంతో కొంత బలమే కదా? అన్నట్టుగా కాంగ్రెస్ నాయకులు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో చేరికలను పెంచడంతో పాటు పార్టీ ప్రచార కార్యక్రమాలనూ ముమ్మరం చేస్తున్నారు. నిత్యం ఈ రెండు నియోజకవర్గాల పరిధి నేతలతో మాట్లాడుతున్నారు. అసంతృప్త నేతలతో వ్యూహరచనపై చర్చిస్తున్నారు. ఏ పార్టీలో నుంచి చేరిన వారితోనైనా అందరితో కలుసిపోవాలని సూచిస్తున్నారు. పక్కనే ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం చేవెళ్ల నియోజకవర్గ పరిస్థితిపై కూడా ఆరా తీశారు.

పరిగి పుర పాలికలో నీటి కష్టాలు!



ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు

నీరున్నచోట్ల వృథా... లేనిచోట్ల జనం అవస్థలు

- కొత్త కాలనీల్లో ట్యాంకులు లేవు... నీటి సరఫరా లేదు
- ఎండిపోతున్న వ్యక్తిగత బోర్లు... ఇబ్బందుల్లో జనాలు
- పట్టించుకోని మునిసిపల్, మిషన్ భగీరథ అధికారులు

పరిగి, ఏప్రిల్ 9: పరిగి మునిసిపల్ పరిధిలో నీటిసరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. మిషన్‌భగీరథ అధికారుల ఇష్టారాజ్యం, మునిసిపల్ అధికారుల అలసత్వంతో తాగునీటి కోసం పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పరిగి పట్టణం ఏటేటా విస్తరిస్తున్నది. కొత్త, కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. అందుకు అనుగుణంగా నీటి సరఫరా జరగడం లేదు. దీంతో జనం నీటి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. పట్టణంలో ఎక్కువగా వ్యక్తిగత బోర్ల ద్వారా నీటి వినియోగం జరుగుతున్నది. ప్రస్తుతం భానుడి భగభగలకు బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు, పాలకులు ముందు చూపులేని కారణంగా నీటి సమస్య తలెత్తుతున్నది. అనేక కాలనీల్లో నల్లాల ద్వారా నీరు వృథాగా పోతుండగా.. మరికొన్ని కాలనీల్లో అయితే అసలు నీటి వసతే లేకుండా పోయింది. మునిసిపల్ అధికారులు నీటి వృథాను అరికట్టక పోవడంతో పాటు మరోవైపు కొత్త కాలనీలకు నీటి వసతిని కల్పించలేకపోతున్నారు. ప్రస్తుతం పరిగి పట్టణ జనాభా దాదాపుగా 26 వేల వరకూ ఉంటుంది. వారికి రోజుకు 33.75 లక్షల కిలో లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం రోజుకు 20 లక్షల కిలో లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. సగటున ప్రతి వ్యక్తికి 135 కిలో లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 80కిలో లీటర్ల నీరు మాత్రమే సరఫరా అవుతోంది. అంటే మిషన్ భగీరథ నీరు సగం కూడా సరఫరా కావడం లేదు.

ఉన్నచోట నీరంతా వృథాయే..

మునిసిపల్ పరిధిలోని నీటి సరఫరా ఉన్నచోట్ల వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల పైపులైన్లు దెబ్బతిని నీరు వృథా అవుతుండగా, మరికొన్ని చోట్ల నల్లాలకు ట్యాబ్‌లు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతోంది. బ్రాహ్మణవాడ, గంగపుత్రకాలనీ, సిద్ధాంతి కాలనీ, విజయ్‌నగర్‌కాలనీ, శ్రీనివాస్‌నగర్‌కాలనీ, కొడంగల్ చౌరస్తాలో మిషన్‌భగీరథ నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పలు కాలనీల్లో తాగునీటిని పట్టుకున్న తర్వాత నల్లా పైపులను మురుగు కాలువల్లోకి వదులుతున్నారు.



బహార్‌పేట్‌లో వృథాగా పోతున్న నీరు

అసలు నీటివసతి లేని కాలనీలు

పరిగి మునిసిపల్ పరిధిలోని అసలు నీటి సరఫరా లేని కాలనీలు చాలానే ఉన్నాయి. తిరుమల రెసిడెన్సీ, భవానీనగర్, అనంతనగర్, మైత్రీనగర్, అనురాగ్‌కాలనీ, అనంతంకాలనీ, వేంకటేశ్వరకాలనీతో పాటు సమీప ప్రాంతాలు, సుల్తాన్‌నగర్ మార్గంలోని కాలనీలకు పైపులైన్లు లేవు. దీంతో అసలు నీటి సరఫరానే లేకుండా పోయింది. ఈ కాలనీల ప్రజలకు వ్యక్తిగత బోర్ల ద్వారానే కాలం వెళ్లదీస్తున్నారు. మునిసిపల్‌కు అన్ని రకాలు పన్నులు చెల్లిస్తున్నా... నీటి వసతిని ఎందుకు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొత్తకాలనీల్లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అసలు నీటి సరఫరా లేని తిరుమలరెసిడెన్సీ

నల్లా కనెక్షన్ ఇవ్వడం లేదు.



నల్లా కనెక్షన్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా ఇవ్వడం లేదు. మా కాలనీకి మిషన్‌భగీరథ పైపులైన్ లేదు. మునిసిపల్ పరిధిలో అనేక కాలనీల్లో తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఏలా ఉంటుందోనని భయంగా ఉంది.

-ఎ.రవీందర్, సిద్ధాంతి కాలనీ, పరిగి

కొత్తకాలనీలో నీటిసరఫరా లేదు



కొత్త కాలనీలకు నీటి సరఫరా లేదు. భవానీ, తిరుమల రెసిడెన్సీకాలనీల్లో ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకు మునిసిపల్ నుంచి పైపులైన్‌లు కూడా వేయలేదు. వ్యక్తిగత బోర్లలో నీరు తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కొత్తగా వాటర్ ట్యాంకు, పైపులైన్లు వేసి సమస్యను తీర్చాలి.

-ఎం.నర్సింహారెడ్డి, భవానీనగర్. పరిగి

జనాభాకు తగ్గట్టు నీటి సరఫరాకు చర్యలు



పరిగి మునిసిపల్ జనాభా కనుగుణంగా ప్రతి వ్యక్తికి రోజుకు 135 కిలో లీటర్ల చొప్పున నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అయితే మిషన్‌భగీరథ నీరు పట్టణ ప్రజలకు సరిపడా రావడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మునిసిపల్‌కు చెందిన 65 బోర్లను కూడా నడిపిస్తున్నాం. కొత్త కాలనీల్లో పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం.

-వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్, పరిగి

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు



కొడంగల్, ఏప్రిల్ 9: కొడంగల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ వేంకటేశ్వరస్వామి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పురోహితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహనం ముందు భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి వాహన సేవ కొనసాగింది. ఉత్సవాలకు కొడంగల్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సుస్థిరపాలన బీజేపీతోనే సాధ్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కీసరరూరల్, ఏప్రిల్ 9: సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ గురువన్న వెంకటరమణ, ఆయనతో పాటు పలువురు బీజేపీలో చేరారు. కిషన్‌రెడ్డి వారందరికిపార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, నాగారం మున్సిపల్ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి : తుల్జాభవాని ఆలయంలో పూజలు చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బీజేపీతోనే దేశ ప్రగతి

షాబాద్/గచ్చిబౌలి, ఏప్రిల్ 9 : బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ, కేసారం గ్రామాలకు చెందిన చల్లా ఇంద్రారెడ్డి, అంజిరెడ్డి, గంధం రమేష్, ఉమ్మెంతాల రమేష్ ఆధ్వర్యంలో 100 మంది యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు చేరుతున్నాయని అన్నారు. మోదీ హయాంలో ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని, భారత్ అతిపెద్ద ఆర్థిక దేశంగా ఎదుగుతోందన్నారు. చేవెళ్ల నుంచి చాలామంది యువత బీజేపీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన యువకులు విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ రత్నం, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, భూత్ అధ్యక్షులు భవదేశ్, సీనియర్ నాయకులు నారాయణ, రాజు, రాజీవ్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తాం

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని శేరిలింగంపల్లి తారానగర్ మార్కెట్‌లోని తుల్జాభవాని ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో బీజేపీ బలంగా ఉందని, గత ఎన్నికల కంటే అత్యధిక మెజార్టీతో విజయకేతనం ఎగురవేస్తామన్నారు.



షాబాద్ : విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న కొమరబండ, కేసారం గ్రామాల యువకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కాంగ్రెస్ మేనిఫెస్టోతో భరోసా

▸▸ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


కడ్తాల్, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టో దేశ ప్రజల్లో భరోసా నింపిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఘోరా పరాభవం తప్పదని అన్నారు. కడ్తాల మండలంలో మంగళవారం నారాయణరెడ్డి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మక్తమాదారం వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లతో కలిసి నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ పోటీయే కాదన్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయామన్న అక్కస్సుతో మాజీ సీఎం కేసీఆర్, ఆ పార్టీ నాయకులు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో లబ్ధికోసం వర్షాభావ పరిస్థితులను రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ మతంపేరుతో రాజకీయ లబ్ధికి యత్నిస్తుందని ఆరోపించారు. బీజేపీ మరోమారు అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదమని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కుల, ఆర్థిక గణన చేపట్టి అన్ని సామాజిక వర్గాలకు మేలు చేస్తుందని చెప్పారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ కేంద్రంలో అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు విఠలయ్యగౌడ్, శంకర్, నర్సింహ, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

దోమ, ఏప్రిల్ 7: లింగన్‌పల్లిలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మురుగు కాలువలు నిండి రోడ్డుపై పారుతున్నాయని పంచాయతీ కార్యదర్శి సోమలింగంకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేసే ట్యాంకు సమీపంలో పైపులైన్ లీకేజీ కావడంతో నీరు వృథా అవుతోందని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలకు సరిపడా నీరు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



లింగన్‌పల్లిలో డ్రైనేజీ దుస్థితి



వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో

విజయం సాధిస్తా

▸▸ చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ▸▸ చిలుకూరు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం



మొయినాబాద్ రూరల్ : రంగరాజన్‌తో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్/గచ్చిబౌలి, ఏప్రిల్ 9 : చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో చేవెళ్ల ఎంపీగా తన గెలుపు ఖాయమని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ నియోజకవర్గ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ఆలయం నుంచి ప్రారంభించినట్లు రంజిత్‌రెడ్డి తెలిపారు. ఇతర నాయకుల్లా కాకుండా తాను నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు. చిలుకూరు వేంకటేశ్వరుడి ఆశీస్సులతో చేవెళ్ల ఎంపీగా ప్రజలు తనను మళ్లీ ఆశీర్వాదించాలని కోరారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసే నాయకులకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. కార్యక్రమంలో రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతారెడ్డి, కుమార్తె ఆకాంక్షరెడ్డి, అల్లుడు రాజేష్ రెడ్డి, కుమారుడు ఆర్యన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించాలి

చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి కోరారు. మంగళవారం ఉదయం నల్లగండ్లకూరగాయాల మార్కెట్‌లో వ్యాపారులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తూ రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత, నాయకులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీతారెడ్డి కోరారు.



చిలుకూరు బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న రంజిత్‌రెడ్డి

మహిళ సంక్షేమానికి పెద్దపీట

కందుకూరు, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో అధికారం చేపట్టి నాలుగు నెలల్లో మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బుక్క ప్రశాంతీ పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో తమ ప్రభుత్వం నాలుగు నెలల కాలంలో ఐదు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేసినట్లు తెలిపారు. పార్ల మెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి విజయానికి ప్రతి మహిళ సహకరించాలని కోరారు.





నియోజకవర్గ నాయకులతో రంజిత్‌రెడ్డి



గచ్చిబౌలి : వ్యాపారులకు ఉగాది పచ్చడి అందజేస్తున్న సీతారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్

రంజాన్ సందడి

▸▸ ఉపవాసదీక్షలకు ఇంకా కొన్ని గంటలే

▸▸ మేడ్చల్ మార్కెట్‌లో కొనుగోళ్లతో షాపింగ్ సందడి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 9: జిల్లాలో రంజాన్ పండుగ సందడి మొదలైంది. పండుగకు కొత్త దుస్తులు కొనడతో పాటు ఇంటి అవసరాలకు ఉపయోగపడే కొత్త వస్తువులు, పరికరాలను కొనడానికి ముస్లింలు ఈ మాసంలో అత్యధికంగా ఉత్సాహం కనపరుస్తారు. రంజాన్ పండుగ కోసం అవసరమయ్యే సామాగ్రిని ముస్లింలు స్థానిక ప్రధాన మార్కెట్‌లోని దుకాణాలనుంచి కొనుగోలు చేస్తుండగా మరి కొందరు నగరం వెళ్లి తమకిష్టమైనవి కొనుగోలు చేస్తున్నారు. పండుగకు వారం రోజుల ముందు నుంచి ముస్లింలు పెద్దసంఖ్యలో షాపింగ్ చేస్తారు. దీంతో దుకాణదారులు రాత్రి 11గంటల వరకు తెరిచి ఉంచడంతో మార్కెట్ కిటకిటలాడుతోంది. పట్టణ వాసులే కాకుండా మేడ్చల్ చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన ముస్లింలు స్థానిక మార్కెట్‌లోని దుకాణాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. హలీం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పాయసం తయారు చేసేందుకు సేమియాలను స్థానిక మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు.



సేమియాలు విక్రయిస్తున్న దుకాణం



బిజీబిజీగా టైలర్ షాపు నిర్వాహకులు

అన్నీ ఇక్కడే దొరుకుతున్నాయి

గతంలో పండుగ షాపింగ్ కోసం నగరం వెళ్లి కొనితెచ్చుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అన్ని వస్తువులు ఇక్కడ మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఉపవాసాలు ఉండి నగరం వెళ్లి రావాలంటే ఇనేక ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం మేడ్చల్ లోనే దొరకడంతో ఇబ్బందులు తొలిగాయి.



- సయ్యద్ షకీల్ పాషా-మేడ్చల్

ఘనంగా
సత్యనారాయణ వ్రతాలు

ఆమనగల్లు, ఏప్రిల్ 9 : పట్టణ సమీపంలోని అంతిరింతిరి కొండపై గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణనాయక్‌లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎస్ఐ భాల్‌రామ్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఎం.డీ ఫరీద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అర్చకులు నాగ ఫణిశర్మ, వెంకటేశ్వర శర్మల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాయకులు పులికంటి మైసయ్య, లక్ష్మణ్ నాయక్, బాల్‌రాజ్,రాంకిరన్, మీనాక్షి, రాములు, బీక్యనాయక్, శీలం వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




పూజల్లో పాల్గొన్న భక్తులు

అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

▸▸ టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

ఆమనగల్లు/కడ్తాల్, ఏప్రిల్ 9 : కేంద్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి డాక్టర్ మల్లు రవి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు విజయసోపానమన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎం.డీ ఫరీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాస్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మల్లు రవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పతనం ప్రారంభమైందన్నారు. మతం పేరుతో బీజేపీ దేశంలో విద్వేషాలను రెచ్చగొడుతుందని మండిపడ్డారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ మోదీ దుర్మార్గ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై దేశ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్‌లు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనకు పెద్దపీట వేస్తుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడు ముందుండాలని పిలుపు నిచ్చారు. ఎంపీపీ అనితవిజయ్, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కేశవులు, జంగయ్య, నర్సింహ్మా,బీచ్యనాయక్, కల్లు రమణారెడ్డి, ఎంగళి ప్రసాద్, బాబా, అలీం, ఖాదర్, మండ్లీ రాములు, గాజుల శ్రీనువాస్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రం వద్ద ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు భాస్కర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరా సింగ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ రాము నాయక్, నాయకులు భానుకిరణ్, అస్గర్ అలీ, క్యామ రాజేశ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, భరత్ యాదవ్, తులసీ రామ్, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో కేక్‌కట్ చేస్తున్న మల్లు రవి


వికారాబాద్: శ్రీమల్లికార్జున భవనంలో పంచాంగ పఠనం చేస్తున్న బసవరాజస్వామి, సాంబశివశర్మ


తాండూరు: భద్రేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


కొడంగల్: హనుమంత వాహనంపై వేంకటేశ్వరస్వామి


పూడూరు: ఎన్మెపల్లిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


తాండూరు రూరల్: అంతారంలో పంచాంగం పఠిస్తున్న పూజారి వెంకటాచార్ శుక్రవార్


వికారాబాద్: మహాత్మా బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ బసవరాజ్

వైభవంగా ఉగాది వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేకపూజలు ● పంచాంగ శ్రవణాన్ని చదివిన వేద పండితులు ● పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

తెలుగు సంవత్సరాది శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మంగళవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో ఉగాది పచ్చళ్లు తయారుచేసి పంచిపెట్టారు. అదేవిధంగా పిండివంటలు చేసుకుని ఆరగించారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.


వికారాబాద్: వీరశైవ లింగాయత్ యువదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడి శిబిరంలో తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ తదితరులు


దోమ: హనుమాన్ దేవాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


కులకచర్ల: మందిపాల్ శివాయంలో పంచాంగం పఠిస్తున్న అర్చకులు


శామీర్‌పేట: భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచాంగం పఠిస్తున్న మురళీధర్‌శర్మ


యాలాల: మండల కేంద్రంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


కొడంగల్ రూరల్: బేకుల్‌కోడ్‌లో అభయాంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


బొంరాస్‌పేట్: భజన కార్యక్రమాలు


కొడంగల్ రూరల్: చంద్రయాన్‌పల్లిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


బొంరాస్‌పేట్: మెట్లకుంటలో పంచాంగం పఠిస్తున్న ఆలయ పురోహితులు


ఘట్‌కేసర్: పోచారం పరిధి అన్నోజిగూడ అయ్యప్ప ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


ధారూరు: ధారూరులోని హనుమాన్ ఆలయంలో పంచాగ శ్రవణంలో పాల్గొన్న గామస్తులు


పెద్దేముల్: మంబాపూర్‌లో పంచాంగం శ్రవణంలో సిద్దిలింగయ్యస్వామి, గ్రామస్థులు


కీసర రూరల్: నాగారంలో పంచాంగం పఠిస్తున్న డాక్టర్ బ్రహ్మశ్రీ రాంకుమార్‌శర్మ


పెద్దేముల్: ఉగాది పండుగను పురస్కరించుకుని మంబాపూర్‌లో సుమారు 80కేజీల బరువుగల రాతిని పేకిఎత్తేందుకు పోటీపడుతున్న యువకులు

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

తాండూరు, ఏప్రిల్ 9: బావిగ భద్రేశ్వర స్వామి బ్రహోత్సవాల సందర్భంగా మంగళశారం బ్రహ్మోత్సవాలు పోస్టర్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం ప్రతినిధులు ఆర్. బస్వరాజ్, శాంత కుమార్ , పటేల్ కిరణ్, లింగదల్లి రవికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభం


బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు

దౌల్తాబాద్, ఏప్రిల్ 9: బీజేపీ మండల కార్యాలయాన్ని మంగళవారం దౌల్తాబాద్‌లో పార్టీ నాయకులు ప్రారంభించారు. మండల అధ్యక్షుడు సతీశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, కుంద్రు నర్సింహులు, కోటకొండ రాము, అశోక్, మోహన్‌రెడ్డి, బుగ్గప్ప, గోపాల్, కృష్ణారెడ్డి, రాజశేఖర్, శ్రీశైలం, అంజన్‌కుమార్, వెంకటప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

సునీతామహేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ ఘట్‌కేసర్ నాయకులు


సునీతా మహేందర్‌రెడ్డితో ఘట్‌కేసర్ నాయకులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 9: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నాయకులు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో జరిగిన పార్టీ ముఖ్యనాయకుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెను కలిసిన వారిలో మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాలు యాదవ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, కందుల కుమార్, నార్ల మల్లేష్, బొక్క జైపాల్‌రెడ్డి, బొక్క సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవనోనిగూడలో క్రికెట్ టోర్నమెంట్

పూడూరు, ఏప్రిల్ 9: పూడూరు మండలం దేవనోనిగూడలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ బోనేటీ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో కెరవెళ్లి టీం మొదటి బహుమతి సాధించింది. విజేతలకు రూ.30వేలు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు యు.శ్రీనివాస్, ప్రశాంత్, పాండు, చిన్న నారాయణ, అంజి, దయాకర్, రాజు, భీమయ్య, అశోక్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. టోర్నమెంట్ సందర్భంగా చిన్న నారాయణ క్రీడాకారులకు అన్నదానం చేశారు.

వైభవంగా సాయిబాబా ఆలయంలో పల్లకీసేవ


ద్యాచారం సాయిబాబా ఆలయంలో పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

వికారాబాద్, ఏప్రిల్ 9: శ్రీశ్రీశ్రీ సమర్ధ సద్గురు షిర్డీ సాయిబాబా మందిరం సప్తమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని ద్యాచారం గ్రామ శివారులో వెలిసిన సాయిబాబా మందిరంలో వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగడ హారతి, అభిషేకం, గణేశ, గోమాత భవానీ మాత, హనుమాన్, నందీశ్వర సహిత సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతాలంకారములు, తీర్థప్రసాదాలు, గణపతి సహ సకల దేవతల హోమం, సాయిబాబా పల్లకీసేవ మధ్యాహ్న హారిత, సంధ్యాహారతి నిర్వహించి భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 9: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం మేడ్చల్ మండల మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని కేసీఆర్ సూచించినట్లు తెలిపారు. అధైర్యపడవద్దని రానున్న కాలం బీఆర్ఎస్‌దేనని కేసీఆర్ ధీమా వ్యక్తం చేసినట్లు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ


బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీ పద్మజగన్‌రెడ్డి

చైర్మన్ భాస్కర్‌యాదవ్ కూడా కేసీఆర్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

వికారాబాద్, ఏప్రిల్ 9: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం ఖాయమని నియోజకవర్గ అబ్జర్వర్ ఎండీ.రహీం అన్నారు. మండలంలోని ఎక్‌మామిడి గ్రామానికి చెందిన ఎండీ.రహీంను చేవేళ్ల పార్లమెంట్ అబ్జర్వర్‌తో పాటు వికారాబాద్ నియోజకవర్గ మైనారిటీ సెల్ అబ్జర్వర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. తనపై నమ్మకంతో మైనార్టీ అబ్జర్వర్‌గా బాధ్యతలు అప్పగించడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఆయన ధన్యవాదాలు


చేవెళ్ల నియోజకవర్గ అబ్జర్వర్ ఎండీ.రహీంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్ రూరల్:** ఘనాపూర్ మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి తల్లి బద్దం రంగమ్మ మంగళవారం మధ్యాహ్నం అనారోగ్యంతో కన్నుమూశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉగాది పండుగ రోజు రంగమ్మ మృతిచెందడం బాధాకరమని గ్రామస్తులు వాపోయారు. ఘనాపూర్‌లో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా, మండల స్థాయి నాయకులు, మాజీ సర్పంచ్‌లు, గ్రామస్తులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరేణుక ఎల్లమ్మ అలయం వద్ద అల్వాల్‌కు చెందిన కాజా అశోక్- వాణి దంపతులు, వారి కుటుంబసభ్యులు, శామీర్‌పేటకు చెందిన బల్లురామ్-ప్రేమదేవి దంపతులు, పరమేశ్వర్- రోహిణి దంపతులు, దేవరాజ్- లక్ష్మీ దంపతులు, శంకర్- నాగమ్మ దంతపతులు, కేఎం కృష్ణతేజ- పూజా దంపతులు వారి కుటుంబసభ్యులు అన్నదానం చేపటారు.

● **ఘట్‌కేసర్:** బాటసారులతోపాటు టౌన్‌షిప్ సిబ్బంది దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పోచారం మున్సిపల్ కౌన్సిలర్, సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాద్ రావు అన్నారు. ఆయన మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా సంస్కృతి టౌన్‌షిప్‌లో మూడు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయించి ప్రారంభించారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

ధారూరు, ఏప్రిల్ 9: ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ధారూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ మండలాధ్యక్షుడు అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి విజయం కోసం కృషిచేస్తామని అవినాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు అశోక్ ముదిరాజ్, రాఘవేందర్ గౌడ్, కార్తీక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

బషీరాబాద్, ఏప్రిల్ 9: మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావును బషీరాబాద్‌లోని ఆయన నివాసంలో పలువురు మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశమై ప్రస్తుత రాజకీయలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వడ్డేశ్రీను, సీనియర్ నాయకులు పవాన్‌ఠాగూర్, నరేష్‌చౌహాన్, ధన్‌సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పరిగి, ఏప్రిల్ 9: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల పలువురు మృతిచెందగా బాధిత కుటుంబాలను మంగళవారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని రంగంపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త బి.చంద్రయ్య మృతిచెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. అదేవిధంగా రంగాపూర్‌తండాకు చెందిన దశరథ్ కుటుంబాన్ని, పూడూరు మండలం నిజాంపేట్‌మేడిపల్లి గ్రామానికి చెందిన బి.జంగయ్యల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

ముగిసిన రామలింగేశ్వరస్వామి జాతర

కులకచర్ల, ఏప్రిల్ 9: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ ఏకశిలా పర్వం పాంబండ శ్రీరామలింగేశ్వరస్వామి జాతర ముగిసింది. ఉగాది పర్వదిన సందర్భంగా మంగళవారం పాంబండకు భక్తుల తాకిడి కొనసాగింది. గుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 11రోజులుగా పాంబండ జాతర ఉత్సవాలు కొనసాగాయి. రాష్ట్రం నలుమూలాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉగాది పచ్చడితో జాతర ఉత్సవాలు ముగియగా స్వామివారిని బండవెల్కిచర్ల గ్రామానికి తీసుకెళ్లారు.

క్రైం కార్నర్

మామిడి ఆకుల కోసం వెళ్లి..
విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

● పండుగ పూట విషాదం


మృతుడు రాములుగౌడ్

పెద్దేముల్, ఏప్రిల్ 9: మామిడి ఆకులు తెంపడానికి వెళ్లి ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన గాజీపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాజీపూర్ గ్రామానికి చెందిన కమ్మరి రవి తనపొలంలో వరిపంటను సాగుచేస్తున్నాడు. పంటకు పందుల బెడద ఎక్కువైందని పొలం చుట్టూ ఇనుపతీగలు చుట్టి దానికి కరెంటు షాక్ తగిలించాడు. విషయం తెలియని అదే గ్రామానికి చెందిన రాములుగౌడ్(60) తనపొలానికి వెళ్ళి పనులు చేసుకున్నాడు. సాయంత్రం పనులు ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో మంగళవారం ఉగాదిపండగ ఉంది కదా అని ఇంటివాకిలికి తోరణాలు కట్టేందుకు మామిడి ఆకుల కోసం కమ్మరి రవి పొలానికి వెళ్లాడు. అక్కడ మామిడిఆకులు తెంపి తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో పొలం చుట్టూ వేసిన ఇనుపతీగకు తగిలాడు. దీంతో అతడికి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు లక్ష్మయ్య గౌడ్ పొలానికి వెలుతూ రాములుగౌడ్‌ను గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గిరి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు..

పరిగి, ఏప్రిల్ 9: డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పరిగిలో మంగళవారం చోటుచేసుకుంది. దుద్యాల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన బోయిని మొగులయ్య(32) సెంట్రింగ్ పని చేస్తుంటాడు. హిమాయత్‌నగర్‌లో ఉంటున్న మొగులయ్య బైక్‌పై ఉగాది పండుగ సందర్భంగా స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో పరిగి పట్టణ శివారులోని భారత్ పెట్రోల్ పంపు దగ్గర వేగంగా వెళ్తూ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 9: మద్యానికి బానిసైన భర్త వేధింపులు భరించలేక ఓ గృహిణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన చింత భారతి(30)కి మేడ్చల్ జిల్లా, కీసర మండలం యాద్గారిపల్లికి చెందిన లక్ష్మణ్‌తో నాలుగేళ్ల కిందట ఉప్పల్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరు ఉప్పల్ నుంచి నాలుగు నెలల కిందట పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధి సాదత్‌అలీగూడలో అద్దెకు ఉంటున్నారు. లక్ష్మణ్ మద్యానికి బానిసై భార్యను నిత్యం శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడేవాడని తెలిపారు. మంగళవారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చి భారతిని కొట్టాడు. దీంతో దెబ్బలు తట్టుకోలేక ఆమె ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని భర్తను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.